

సిద్ధమవుతున్న రైతుబజార్

- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రారంభం
- 80శాతం పనులు పూర్తి
- ఎన్నికల నేపథ్యంలో విరామం
- తర్వాత పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- స్థానికుల ఒత్తిడితో పనులు పునఃప్రారంభం
- త్వరలో అందుబాటులోకి..

ఆరిలోవ: ఆరిలోవ వాసుల రైతుబజారు కల సాకార మవుతోంది. పనులు సుమారు 95శాతం పూర్తి కావడంతో త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఇక్కడ రైతులు, డ్వాక్రా మహిళలు, వ్యాపారులకు అవసరమైన షాపులు, నిర్వహణ గదులు సిద్ధమయ్యాయి. ఇంకా ప్లాట్‌ఫారం నిర్మాణం, వాహనాల కోసం పార్కింగ్ స్థలం చదును వంటివి చేయాల్సి ఉంది. ఈ పనులు సుమారు వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. అవి పూర్తయితే ఇంక ప్రారంభానికి అంతా సిద్ధమైనట్లే. రైతుబజారు ప్రారంభమైతే కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎంవీపీ కాలనీ, సీతమ్మధార రైతు బజార్లకు వ్యయప్రయాసలకోర్చి వెళ్లాల్సిన అవసరం ఉండదని, దూరాభారం తగ్గుతుందని స్థానికులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.



నిర్మాణ దశలో ప్లాట్‌ఫారాలు

38 స్టాళ్ల ఏర్పాటు

రైతుబజారులో రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకు కూరలు, పళ్లు విక్రయించడానికి 38 షాపులు, వ్యాపారుల కోసం 5 కిరాణ షాపులు నిర్మించారు. ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మన్ గది, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, రైతులు, వినియోగదారులకు తాగు నీటిని అందించే ఆర్వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది ఏర్పాటు చేశారు.

త్వరగా ప్రారంభించాలి



కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఇక్కడ రైతు బజార్ నిర్మించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మా కల నెరవేరింది. నగర మేయర్‌గా స్థానికురాలు గొలగాని హరి వెంకట కుమారి అయ్యాక ఇక్కడ రైతు బజార్ నిర్మాణం మొదలైంది. త్వరితగతిన పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలి.

– వంకర బాబూరావు, రామకృష్ణాపురం

దూరాభారం తగ్గుతుంది



ఇక్కడ రైతుబజార్ లేకపోవడంతో ఎంవీపీ కాలనీ, సీతమ్మధారకు సిటీ బస్సులు, ఆటోల్లో వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ రైతుబజారు అందుబాటులోకి వస్తే మాకు దూరాభారం తగ్గుతుంది. ఇంత పెద్ద ప్రాంతంలో రైతు బజార్ అత్యవసరం. తొందరగా దీన్ని ప్రారంభించాలి.

– సీహెచ్ నారాయణరావు, ఆరిలోవ

వైఎస్సార్‌సీపీ శ్రీకారం

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రజోపయోగం కోసం ఆరిలోవ ప్రాంతానికి రైతు బజార్ కేటాయించారు. దీని కోసం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పక్కన పెదగదిలి గెడ్డను ఆనుకుని ఉన్న రెవెన్యూ విభాగానికి చెందిన అరెకరం స్థలాన్ని 2022 అక్టోబరులో కేటాయించారు. రైతు బజార్ నిర్మాణం కోసం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు రూ.80 లక్షలు కేటాయించడంతో 2023 ఫిబ్రవరిలో పనులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి చకచకా జరుగుతున్న పనులు 2024లో సాధారణ ఎన్నికలు జరగడంతో నిలిచిపోయాయి. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చతికలపడ్డాయి. గత ప్రభుత్వం పూర్తిగా నిధులు విడుదల చేయలేదనే నెపంతో అప్పటికే సుమారు 80 శాతం వరకు జరిగిన పనులు నిలిపేశారు. దీంతో కొద్ది నెలలు ఓపిక పట్టిన స్థానికులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుపై ఒత్తిడి తేవడం, మార్కెటింగ్ శాఖ అధికారులకు వినతులు పంపడంతో రైతు బజార్ పనులను ఇటీవల పునః ప్రారంభించారు. రైతు బజార్ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి, శుభ్రం చేయించారు. మిగిలిన పనులు జరుగుతున్నాయి. నిర్మాణం పూర్తయిన గదులకు, షాపులకు పెయింటింగ్ వేశారు. ప్రధాన ద్వారం వద్ద గేటు ఏర్పాటు చేశారు. ఇంకా ప్లాట్‌ఫారం నిర్మాణం, వాహనాల కోసం పార్కింగ్ పనులు జరగాల్సి ఉంది.

రామ్‌నగర్‌లో ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: దోమల బెడద తగ్గించేందుకు జీవీఎంసీ సిబ్బంది మంగళవారం రామ్‌నగర్ ప్రాంతంలో ఫాగింగ్ చేశారు. వార్డు పర్యటనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావుకు స్థానికులు దోమల సమస్యను వివరించారు. ఇక్కడ దోమలు ఎక్కువగా ఉండటంతో అనారోగ్యానికి గురవుతున్నామని విన్నవించారు. దీంతో ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి ఫాగింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పల్లాకు కృతజ్ఞతలు తెలిపారు..

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్

దాబాగార్డెన్స్: వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా నగర ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం స్టేక్ హోల్డర్స్‌తో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ జీవీఎంసీ పరిధిలో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అలాగే నివాస సంక్షేమ సంఘాల సభ్యులు, ఎన్జీవోలు, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా నగరంలో చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. వారికి కూడా జీవీఎంసీ సహకారం అందిస్తుందని, వారు కోరిన మేరకు తాగునీరు అందిస్తామని చెప్పారు. వేసవిలో మధ్యాహ్నం వేళ వృద్ధులు, పిల్లలు తప్పని పరిస్థితిలో తప్ప బయటకు రావొద్దని, వదులుగా ఉన్న తెలుపు రంగు కాటన్ దుస్తులు ధరిస్తే మంచిదని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీరు రాజేంద్ర కృష్ణ, జోనల్ కమిషనర్లు మల్లయ్యనాయుడు, శివప్రసాద్, ఏఎంఓహెచ్‌లు డాక్టర్ సునీల్ కిషోర్, డాక్టర్ అప్పలనాయుడు, బి ప్రసాదరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువత భవితకు సంస్థ కృషి అభినందనీయం



మాట్లాడుతున్న ఎంపీ శ్రీభారత్

బీచ్‌రోడ్డు: యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో 'నిర్మాణ్ ఎన్జీఓ హెచ్ఆర్' చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీ శ్రీభరత్ కొనియాడారు. 'ఇంపాక్ట్ హైరింగ్' అంశంపై నగరంలోని ఓ హోటల్‌లో నిర్మాణ్ ఎన్జీఓ హెచ్ఆర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎంపీ శ్రీభరత్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. సీపీ మాట్లాడుతూ ఉద్యోగం అందరికీ హక్కు అనే విధంగా నిర్మాణ్ సంస్థ అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. నిర్మాణ్ ఎన్జీవో హెచ్ఆర్ సంస్థ ఫౌండర్ అండ్ సీఈవో మయూర్ పట్నాల మాట్లాడుతూ 'ఇంపాక్ట్ హైరింగ్ కేవలం ఉద్యోగావకాశాలు కల్పించడమే కాదని, ప్రతి ఒక్కరికి ఆర్థిక వ్యవస్థలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. కార్యక్రమంలో పాత్ర ఇండియా బీపీవో ఎండీ లక్ష్మి ముక్కవిల్లి, ఇన్ఫోసిస్ విశాఖపట్నం డీసీ హెడ్ సురేశ్ నర్రా, ఇన్‌వెస్కో ఇండియా హెచ్ఆర్ డైరెక్టర్ ప్రత్యూష శర్మ పాల్గొని తమ అనుభవాలు పంచుకున్నారు.

ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న సీఐ యర్రంనాయుడు

అల్లిపురం: ప్రతి వీధిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టూటౌన్ సీఐ యర్రంనాయుడు సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన తన సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా కల్లుపాకలు ప్రాంతంలో పర్యటించారు. స్థానికంగా నివసిస్తున్న గృహస్థులను, మహిళలను, పిల్లలను ఒక దగ్గరకు చేర్చి వారితో మాట్లాడారు. ముఖ్యంగా పోక్సో కేసులు, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, డ్రగ్స్ వినియోగం, అమ్మకాలు జరిపితే చట్టపరంగా తీసుకునే చర్యల గురించి ఆయన అవగాహన కల్పించారు.

గ్యాస్ ధర పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద గ్యాస్ సిలిండర్లతో సీపీఐ నేతల నిరసన

సీతమ్మధార: కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిన్న ఆగమేఘాల మీద గ్యాస్ బండపై రూ. 50 ను అమాంతంగా పెంచడాన్ని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు బొట్టా ఈశ్వరమ్మ తీవ్రంగా ఖండించారు. పెంచిన గ్యాస్ ధరను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిలిండర్లతో నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే ఆదాయాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్యాస్‌పై రూ. 50 పెంచడం దారుణమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా రాష్ట్ర కూటమి ప్రభుత్వం ధరలను అదుపు చేయడం లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం గ్యాస్ ధర పెంచినా రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకపోవడం దురదృష్టకరమని ఆమె అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఉచిత మూడు గ్యాస్ సిలిండర్ల పథకం చాలా మంది పేదలకు అందడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, కంచరపాలెం జోన్ కమిటీ సభ్యులు యు.ఎస్.ఎ. రాజు, జి.అప్పలరాజు, మద్దిలపాలెం జోన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నూతన కమిటీ

సీతంపేట: అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ (ఏఎంసీ) నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం రామాటాకీస్ రోడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. నూతన అధ్యక్షుడిగా బొడ్డు కల్యాణరావు, కార్యదర్శిగా జేవీ ప్రభాకర్, కోశాధికారిగా గార సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఉపాధ్యక్షులుగా మద్ది అప్పలకొండ, అలమండ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా బత్తుల గౌతంబాబు, పతివాడ రాంబాబు, ఇతర కార్యవర్గ సభ్యులు అతిథుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ, ఐఏఎస్ఈ బీఈడీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'సే నో టు డ్రగ్స్' పేరిట మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐఏఎస్ఈ నుంచి ఏయూ రిజిస్ట్రార్ ఆఫీస్ వరకు ర్యాలీ సాగింది. యాంటీ డ్రగ్ ర్యాలీలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నాగరాజ కుమారి, ఆచార్య పుష్ప, అధ్యాపకులు, బీఎడ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) మహిళా ఎస్ఐ వి.కీర్తిరెడ్డి, జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావులు తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫామ్‌లలో మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో చెన్నైకి చెందిన పాండియన్ ఆర్ అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి సుమారు రూ. 26,500 విలువైన 5.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

వైభవంగా కోదండరాముని ఊరేగింపు



సీతారాములను ఊరేగిస్తున్న భక్తులు



చిన్నారుల కోలాటం

ఏయూక్యాంపస్: స్థానిక అవుట్‌గేట్ కల్యాణ్‌నగర్ వద్దనున్న కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి తిరువీధి ఉత్సవాన్ని భారీగా భక్తులు తరలి రాగా వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ భక్తజనం పల్లకీలో స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. భక్తిగీతాలకు అనుగుణంగా సాగిన చిన్నారులు కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ పురోహితులు సాగర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు రాంబాబు, సత్యనారాయణ, ప్రసాద్, గోవింద రాజు, శ్రీకాంత్, కుకుటేశ్వర రావు, పైడిరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రుణమేళాకు విశేష స్పందన



రుణాల కోసం పోటెత్తిన దరఖాస్తుదారులు

సీతమ్మధార: ఆశీల మెట్టలోని జోన్–3 కార్యాలయం దరఖాస్తుదారులతో నిండిపోయింది. జోనల్ కమిషనర్, యూసీడీ అధికారులు, బ్యాంక్ అధికారులు, బీసీ కార్పొరేషన్ అధికారులు కలిసి రుణాల మంజూరుపై అవగాహన కల్పించారు. బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు మంగళవారం నిర్వహించిన రుణ మేళా ఇంటర్వ్యూలకు మంచి స్పందన లభించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ కార్పొరేషన్ల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద వివిధ యూనిట్లకు బ్యాంకు రుణాలు, సబ్సిడీ మంజూరు కోసం 14 వార్డుల నుంచి 2,184 మంది దరఖాస్తు చేసుకున్నారు.జోన్–3 జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్ అధ్యక్షతన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ఉదయం 9.30 నుంచి 14 నుంచి 20 వార్డుల వారికి, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 7 వరకు 21 నుంచి 27 వార్డుల దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటివరకు 14 వార్డుల నుంచి 1,634 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రంజిత్ కుమార్, ఆర్. కోటేశ్వరరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ అజయ్ కుమార్, ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ జయలక్ష్మి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, ఏపీడీ రాము, వార్డు కార్పొరేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముంచెత్తిన వాన

రహదారులు జలమయం



ఇసుకతోట జాతీయ రహదారిపై వర్షపునీటిలో వాహన చోదకుల ఇక్కట్లు

మద్దిలపాలెం: ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండవేడి, ఉక్కపోతతో సతమతమైన నగరవాసులు మంగళవారం రాత్రి ముంచెత్తిన వానతో ఊరట చెందారు. రాత్రి 9 గంటల తర్వాత ఒక్కసారిగా భారీగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఇసుకతోట జంక్షన్ జలమయంగా మారిపోయింది. సిగ్నల్ సమీపంలో వర్షం నీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. వెంకోజీపాలెం, మద్దిలపాలెం, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోట ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. కాల్వల్లో చెత్తచెదారం రోడ్లపైకి, వీధుల్లోకి చేరడంతో అస్తవ్యస్తంగా తయారైంది.





వెంకోజీపాలెం వద్ద జాతీయ రహదారిపై నిలిచిన నీరు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పార్చనలో పాల్గొన్న పలువురు దంపతులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వర రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు మంజూరు చేయాలి



సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీతమ్మధార: పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జీవో 30 ప్రకారం రెవెన్యూ అధికారులు పట్టాలు మంజూరు చేయాలని, గతంలో ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మద్దిలపాలెం, కంచరపాలెం జోన్ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద కొత్త పట్టాల కోసం, గత పట్టాల రిజిస్ట్రేషన్ కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్, ఈశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు, పోరంబోకు స్థలాలు, మురికివాడల్లో ఏళ్ల తరబడి నివసిస్తున్న వారికి శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వివాదస్పద స్థలాల్లో ఉన్నవారికి ప్రభుత్వమే పరిష్కారం చూపాలని కోరారు. ధర్నాకు వచ్చిన లబ్ధిదారులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ ఎం.రమేష్ మాట్లాడుతూ, దరఖాస్తులు పరిశీలించి పట్టాలు మంజూరు చేస్తామని, ప్రభుత్వం ఆదేశాలు రాగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.కృష్ణారావు, యు.ఎస్.ఎ. రాజు, జి.అప్పలరాజు, పి.వెంకటరావు, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖకు డ్రోన్ అందజేత



డ్రోన్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి అందజేస్తున్న వరుణ్‌గ్రూపు ప్రతినిధులు

అల్లిపురం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వరుణ్ గ్రూప్ సంస్థ నగర పోలీస్ కమిషనరేట్‌కు అత్యాధునిక డ్రోన్‌ను అందజేసింది. మంగళవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని కలిసి డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల ద్వారా నగరంలో శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు, నేరాల నియంత్రణ, నేర పరిశోధన కూడా చేయవచ్చని కమిషనర్ అన్నారు. వీఐపీల భద్రతా ఏర్పాట్లలో నిఘా కోసం వీటిని ఉపయోగించవచ్చని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని డ్రోన్లు నగర పోలీసు శాఖ వినియోగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. వైజాగ్‌లో ప్రతి అడుగునా పోలీసు లేదా డ్రోన్ నిఘా ఉండాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.